# భ్రమ

ఉయ్యాల నెమ్మదిగా వూగుతోంది. అందమైన పాపాయి అందులో జోగుతోంది. నిద్రపోతూనే పాప మెల్లగా, చల్లగా, హాయిగా నవ్వుతోంది. నిద్రలో దేవుడు పాపని నవ్విస్తున్నాడు కాబోలు - నవ్వుతోంది. మరొక్క క్షణానికి ఏడుస్తున్నట్లు క్రింద పెదివి బిగించి ఏడ్వబోయి ఆపేస్తోంది. వూగుతున్న వుయ్యాలలో పాపని ఉమ కన్నార్పకుండా చూస్తోంది. మమకారం, మాతృత్వం, ఆనందం ఇంకా ఏవో కలగా పులగంగా ఆమె మనసులో కలకలం చేస్తున్నాయి. ఆమె పెదవులు ఏదో పాటని పలుకుతున్నాయి. హృదయం తెలియని రాగం ఆరోహణావరోహణలు చేస్తోంది ఉమ పాపని చేతుల్లోకి తీసుకుందామనుకుంది ఆమె రెండు చేతులు ఊయలలోని మెత్తని పాపని స్పృశించాయి ఏదో పులకింత.

తలుపు దబదబ శబ్దంతో ఉమ ఉలిక్కిపడి లేచి కూర్చుంది. చేతుల్లో పుస్తకం ఎప్పుడో జారిపోయింది కాబోలు. మంచం క్రింద పడివుంది. టేబుల్ మీద గడియారం

ఐదు గంటలు చూపిస్తుంది. ఉమ అయోమయంగా యిటూ అటూ చూసింది. ఉయ్యాల లేదు, పాపలేదు. అసలు ఏమీ లేదు. కల, పగటికల - మళ్ళీ తలుపు చప్పుడైంది. ఉమ నెమ్మదిగా లేచింది. ఏమిటో తెలియని నిరుత్సాహం శరీరాన్ని చాలా బలహీనపరుస్తుంది. అడుగులో అడుగు వేసుకుంటూ తలుపువైపుకి నడిచింది. గోడమీద కేలండర్ "బాబు" నోట్లో వేలు పెట్టుకుని నవ్వుతున్నాడు. వాణ్ణి చూస్తే ఉమకి చటుక్కున నవ్వొచ్చింది. ఒక్క అడుగు వేసి వాడి బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. మత్తువదిలి పోయినట్లే ఒక అంగలో తలుపు దగ్గరకి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా పట్టుచీరలో శ్యామల నిలబడివుంది.

"ఏమే ! ఏం చేస్తున్నావ్. ఎన్నిసార్లు బాదానో తలుపు" అంటూ గరగరలాడే చీరతో లోపలికి అడుగు పెట్టింది.

"ఏమీ చెయ్యడం లేదు. అలా పడుకున్నా - నిద్ర పట్టేసింది."

"ఛీ ! ఏదీకాని వేళ ఏమిటా నిద్ర ! సరేగాని ఇప్పుడే ఒక గంటలో మా అబ్బాయిని తొట్లెలో వేస్తున్నాం. నువ్వు తప్పకుండా రావాలి" అంది.

"నేనెందుకే -" అంది ఉమ. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో కదిలిన విషాదచ్ఛాయ కనిపెట్టేసిన శ్యామల,

"ఏయ్, నువ్వలా అంటే నేనూరుకోను. నువ్వు రావాల్సిందే మా బుజ్జిగాణ్ణి దీవించాల్సిందే" అంది ఉమ భుజాలమీద చేతులు వేసి ఆమె కళ్ళల్లోకి సూటిగా చూస్తూ. ఆమె ఏమీ మాట్లాడలేదు. ఆమె మనసు మౌనంగా బాధ పడుతోంది. అది ముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే వుంది. శ్యామల యింక భరించలేకపోయింది.

"ఏమే ఉమా, ఏమిటే రావా !- వెంటనే చీర మార్చుకో నాతోనే వద్దువుగాని - త్వరగా - అవతల అంతా వచ్చేస్తూ వుంటారు" అంటూ తొందరచేసింది.

ఉమకి ఒక్కసారిగా చైతన్యం వచ్చినట్లు వులిక్కిపడింది. "సర్లే వస్తున్నాను" అని లోపలికెళ్ళి ఆకుపచ్చ అంచు తెల్లచీర కట్టి బయలుదేరింది. శ్యామల యింటికి చేరేసరికి అప్పటికే ఒకరిద్దరు వచ్చి వున్నారు. శ్యామల తల్లి హడావిడిగా అటూ యిటూ తిరుగుతున్నారు. ఉమని చూడగానే "ఆ వచ్చావా ! యిప్పుడే అనుకున్నా. రా - లోపల కొంచెం పనుంది" అన్నారు. ఉమ ఆమెని అనుసరించింది. లోపల శనగలు, పళ్ళు, తాంబూలం పేకెట్లలో సర్దుతూ ఏవో కబుర్లు చెప్తుంది ఉమ. హాలులో చాలామంది వచ్చినట్లున్నారు. గలగలమంటూ మాటలు, పిల్లల కేకలు వినిపిస్తున్నాయి. బాబుని ఉయ్యాలలో పడుకోబెట్టారు. ముత్తయిదువులు హారతి పట్టారు. ఎవరో గొంతెత్తి "హారతి గైకొనుమా" అంటూ పాడారు. వెనుక గదిలోనే ఉండి

పోయిన ఉమ అన్నీ వింటూనే వుంది. కొంచెం సేపటికి పేరంటాళ్ళు వెళ్ళిపోయారు. అప్పటిదాకా యిల్లు ఎగిరిపోయేలా ఏడ్చిన బాబు వూరుకున్నాడు. ఇంతలో శ్యామల లోపల గదిలోకి వచ్చి-

"ఎన్నిసార్లు చెప్పినా బయటకు రావేమే. ఇలా ముడుచుకుపోతే ఎలా చెప్పు" అంది.

"ఫరవాలేదు. బుజ్జిగాడిని స్పెషల్‌గా దీవిస్తాను. నేనందరితోటి దాన్ని కాదుగా" అంది ఉమ.

"సరే ! రా. వాడికీ తెలుసు ! వాళ్ళంతా వున్నప్పుడు ఏడ్చినా నువ్వొచ్చే సమయానికి చక్కగా, గువ్వపిట్టలా పడుకున్నాడు చూడు" అంటూ వుయ్యాలలోంచి బాబుని తీసి ఉమ చేతికి యిచ్చింది. చంటివాడు మెత్తగా, దూదిలా వున్నాడు. నెల కూడా నిండని ఆ పసికందును చూసి ఆమె మురిసిపోయింది. పిడికిలి మూసిన చేతులు లేత గులాబీ రేకుల్లా ఎర్రగా వున్నాయి. ఆ బాబుకేసి చూస్తూ వొళ్ళో పెట్టుకుని చాలసేపు కూర్చుంది ఉమ. తనివితీరని ఆ మమత లోపలినుంచి బయటకి పెల్లుబికి, బయటపడటానికి సిగ్గుపడుతోంది శ్యామల. ఆమె తల్లి అక్కడ లేకుండా చూసి ఉమ బాబు బుగ్గల మీద ప్రేమగా మనసారా ముద్దు పెట్టుకుంది. ఎంత కొత్త అనుభూతి - తన్మయత్వం ? ఉమ కళ్ళు మూసుకుంది. వెచ్చగా చీర తడిసిపోతే చటుక్కున చూసి "అమ్మదొంగా నాకు చక్కని మర్యాద చేశావన్నమాట" అంది. అప్పుడే అక్కడికి వచ్చిన శ్యామల -

"అరే! చేశాడూ శాస్త్రీ! చూశావా వాడికి నువ్వంటే ప్రేమే, అందుకని...." అంటూ గలగల నవ్వింది. ఉమ పిల్లాడిని శ్యామలకిచ్చి లేచింది. "వస్తా శ్యామూ, చీకటిపడింది" అంది.

"ఉండు" అంటూ ప్యాకెట్ తెచ్చి చేతిలో పెట్టింది శ్యామల. అది తీసుకుని బయలుదేరింది ఉమ. ఆమె మనసు బరువుగా ఎంతో యిష్టమైన దానిని వదలి వెళ్ళిపోతున్నట్లుగా అయిపోయింది. శ్యామల "రేపు వస్తాలే మీ యింటికి" అంటూ లోపలికెళ్ళిపోయింది.

ఉమ ఉత్తరం చదివి ఆలోచిస్తూ కూర్చుండి పోయింది. మనసు గందరగోళంగా వుంది. తలుచుకోకూడదు అనుకున్న జ్ఞాపకాలు మనసులో యినుప ద్వారాలు తెరచుకొని ఒక్కొక్కటి బయటకొస్తున్నాయి. స్మృతి పథంలో కొన్ని తియ్యనివి, కొన్ని, విచారకరమైనవి, మరికొన్ని భయంకరమైనవి - ఏవీ ఆగకుండా అతి వేగంగా ఆలోచనలు పరుగు పెడుతున్నాయి. ఉమ ఉత్తరం టేబుల్‌మీద పెట్టి కుర్చీ వెనక్కి తలవాల్చి పైన దూలాలు లెక్కపెట్టడం మొదలు పెట్టింది. దేవకి పెళ్ళి, మధుమూర్తితో పరిచయం, తరువాత తన పెళ్ళి ఆ తరువాత....

*   *   *

పెళ్ళి మంచి జోరుగా జరుగుతోంది. దేవకి, మధు మూర్తి చక్కని జంట అంద చందాలలోనూ, చదువు

సంధ్యలలోను యిద్దరూ ఎవరికెవరూ తీసిపోరు. పెళ్ళిలో అంతా ఆ జంటని వేనోళ్ళ పొగిడారు. అప్పుడే దేవకి స్వయంగా పరిచయం చేసింది మధుమూర్తిని. అందమైన అతని జుట్టు, నవ్వే అతని కళ్ళు, ఎంతో కలుపు గోలుగా మాట్లాడే అతని మాటల ధోరణి ఉమలో ఎక్కడలేని యిష్టాన్ని కల్పించాయి. కాని ఆ నాడే అనుకుంది అతను తన ప్రాణ సమానురాలైన దేవకి భర్త. దేవకికి మధుమూర్తి అంటే ఎంత యిష్టమో ఆమెకి ముందు నుంచీ తెలుసు. ఆ పెళ్ళి మూడు రోజులు హాస్యాలతో, ఆకతాయి చేష్టలతో, అల్లరి చిల్లరి పాటలతో పేకాటలతో మూడు నిముషాల్లా గడిచిపోయాయి. ఆ రోజు తను యింటికి వచ్చేస్తూ -

"ఈ సారి మీ కాపురం చూడ్డానికి వస్తాను" అంది తను పెద్ద ఆరిందాలా.

"ఓ యస్ తప్పకుండా రావాలి, వచ్చేటప్పుడు ఒకటి రెండు రోజులుండేలా వస్తే కుదరదు" అని మధుమూర్తి అంటే "మీరుండమంటే జీవితాంతం వుండిపోతా తెలుసా జాగ్రత్త" అంది తను ధీమాగా. దేవకి మధు ఫెల్లున నవ్వారు. ఆ రోజు తనెందుకలా అంది ? మనసులో దాచుకోలేని యిష్టమా అది ? అప్పుడేమనుకున్నా దేవకి యిప్పుడేమను కుంటుంది ?

గోడమీాద నుండి బల్లి క్రిందపడింది. ఉమ ఉలిక్కి పడింది. ఆలోచనలు చెదరిపోయాయి. కుర్చీలోంచి లేచి

మంచినీళ్ళు తాగి మంచం మీద వెల్లకిలా పడుకుంది. పగలంతా కష్టపడి కట్టుకున్న గడ్డి పరకల గూటిలో పిచ్చుకలు కిచకిచ మంటున్నాయి.

తనకి విశ్వనాథంతో పెళ్ళి స్థిరపడిపోయింది. విశ్వనాథాన్ని చేసుకోవడంలో తను అయిష్టం వెలిబుచ్చలేదు. కాని ఏదో అసంతృప్తి మనసులో నిలిచిపోయింది. పెళ్ళి అయిపోయింది. పెళ్ళికి దేవకి రాలేకపోతూ మధుని పంపింది. ఎవరిని తలుచుకోకూడదని తను అనుకుందో ఆ వ్యక్తి కళ్ళెదుట కనిపించి కవ్వించినట్లనిపించింది. ఎంతో నిగ్రహించుకుని విశ్వనాథం మీద మనసంతా నిలుపుకుని అతనికే తన సర్వస్వం అర్పించుకుంది. కాని తన మనసు కలుషితం, అందుకే విశ్వనాథం నెల తిరక్కుండానే స్కూటర్ ప్రమాదంలో మరణించాడు. తనూ, తన ఆలోచనలు, మొండి గోడలా మిగిలిపోయాయి. ఆపేసిన చదువు పూర్తి చెయ్యడం కర్తవ్యం అయింది. బి. ఏ. అయింది, బి. ఇ డి. చేసింది. ఇంకా ఏం చెయ్యాలి ? ఉద్యోగం చెయ్యాలి. తన డబ్బు తను సంపాదించుకుని తన బ్రతుకు తను బ్రతకాలి. ఎందుకు బ్రతకాలి ? చావలేక బ్రతకాలి. ఎందుకు చావలేదు ? చావు అనగానే ఉమ వులిక్కిపడి చిరాకుగా మంచం మీద లేచి కూర్చుంది. దగ్గరలో చేతికి అందితే రేడియో పెట్టింది.

"అగాధమౌ జలనిధిలోన
అణిముత్య మున్నటులే
శోకాల మరుగున దాగి
సుఖమున్నదిలే—" అంటోంది.

ఆమె రేడియో దగ్గరగా తలఆన్చి కళ్ళు మూసుకుంది.

o o o

ఆ రోజు వుదయం లేచిన దగ్గరనుండి ఉమని ఏదో తడబాటు వెంటాడుతూనే వుంది. ఎన్నాళ్ళు ఎన్నాళ్ళ తర్వాత మధుమూర్తి మళ్ళీ తనకంటబడటం! ఆమెకి ఆనందంగానే వుంది. కాని తెలియని భయం మనస్సంతా అలుముకుంటోంది. మధ్యాహ్నం పోస్టులో ఇంటర్వ్యూ కార్డువచ్చింది. ఒక స్కూల్లో బి. ఇడి. టీచర్‌గా, మొట్టమొదటి సారిగా తను వూరు దాటి ఉద్యోగానికి బయలుదేరడం ఆమెకి కంగారుగా వుంది. సాయంత్రం ఆరు గంటలవుతూ వుండగా చిన్న సూట్‌కేస్‌తో దిగాడు మధుమూర్తి. ఆరేళ్ళ కాలంలో అతను పెద్దగా మారలేదు. కొంచెం వొళ్ళొచ్చి హుందాగా అయ్యాడనుకుంది ఉమ. చిరునవ్వుతో ఆహ్వానించింది. మధుమూర్తి మాత్రం ఆమెనీ చూసి ఒక్కక్షణం ఆశ్చర్యంతో వుండిపోయాడు. ఆభరణాలులేని పాలరాతి విగ్రహానికి తెల్లని చీర కట్టినట్లు వుంది ఉమ.

"ఏమిటి అలా అయిపోయావు ఉమా" అన్నాడు ఆశ్చర్యంనుండి తేరుకుంటూ, అతని ఏకవచన ప్రయోగంలో ఉమకి ఎంతో ఆత్మీయత కనిపించింది. అతని పలకరింతకి చల్ల గాలికి చలించే మేఘంలా అయి ఆమె కనురెప్పలలో నీరు నిలిచింది. ఆమెకి మాటలు కరువైనాయి.

మారు మాట్లాడకుండా లోపలికి నడిచింది. అతను కాస్త సేద తీర్చుకునేటంతలో చక్కని కాఫీ తెచ్చియిచ్చింది. అతనితో అవీ యివీ మాట్లాడుతూ, ముందు గదిలోకి వంట గదిలోకి తిరుగుతూ ఉమ వంటపూర్తి చేసింది. మధు ఎన్నో కబుర్లు ఏనాటివో - ఒక్కటేమిటి అన్నీ మాట్లాడుతున్నాడు. ఎనిమిది కావస్తుంటే "భోజనం చేస్తారా" అంది ఉమ.

"నాకయితే చాలా ఆకలిగా వుంది – నీకు పని అయి పోతే నా కాలశ్యం లేదు" అన్నాడు.

బంగాళదుంప వేపుడు. కొబ్బరి పచ్చడి సాంబారు అప్పడాలు వడియాలు - మధు విస్తరిముందు కూర్చుని ఫకా లున నవ్వాడు "ఏమిటిదంతా ? పెళ్ళి భోజనమా" అంటూ చమత్కరించాడు.

"ఆ....ఏమీలేదు ఏం చేశాననీ—" అని కాస్సేపాగి "దేవకి కంటే చెయ్యగలనా" అంది. దూరంగా మోకాళ్ళ మీద గడ్డం ఆనించి కూర్చుని. అలా ఎందుకందో ఆమెకే తెలియదు. తీరా అనేశాక బాధగా అనిపించింది. మధుమూర్తి మాత్రం నవ్వుతూ "సరేలే, దేవకికి కథలు వ్రాయడంలో, పాటలు పాడటంలో, లెక్చర్లు దంచడలో వున్న హుషారు

వంటలో లేదు. ఏ కూరైనా సరే చకచకా యింత నూనె పోసి వేయించి వుప్పూకారం వేస్తుంది. దట్సాల్" అన్నాడు. అతను అలా మాట్లాడుతుంటే అతని వంక కన్నార్పకుండా చూస్తున్నా అన్ని మాటలూ వినలేదు. కొన్ని మాత్రం వింది, కాని అతను చెప్పింది అర్థమైంది. తను చేసింది అతను మెచ్చుకుంటున్నా దేవకిని విమర్శించడం ఎక్కడో మనసులో బాధగా అనిపించింది.

మీరలాగే అంటారు. కథలు వ్రాయడం పాటలు పాడటం అంత తేలిగ్గావుందా ?" అంది చిరుకోపం నటిస్తూ. మధుమూర్తి ఒక్కక్షణం నిశ్శబ్దంగా వున్నాడు. కంచంలో అన్నం అటూ యిటూ కదుపుతూ ఏదో ఆలోచిస్తున్నట్లు అతను గంభీరంగా అయిపోయాడు అంతలో.

"కాని మగవాడు భార్యనుండి కోరుకునేవి కొన్ని వుంటాయి కదా : ఆమె ఎంత రచయిత్రిగాని, గాయకురాలు గాని అవన్నీ అతని సాన్నిధ్యంలో కాదుకదా ! అంతకుమించి యింకా ఏదో వుంటుంది నువ్వు కాదనగలవా !" అన్నాడు. అతని మాటల్లో ఎంతో బాధ, ఏదో వెలితి అంతరాంతరాలలో అసంతృప్తి కనిపిస్తున్నాయి.

ఆమె ఏమీ మాట్లాడకుండా కూర్చుంది. కొన్ని క్షణాలు వారి మధ్య నిశ్శబ్దంగా గడిచిపోయాయి. ఇంక ఆమె భరించలేక "మీరలా మౌనవ్రతం పడితే ఎలా !" అంది.

"మౌనవ్రతమా! ఛ ఛ - అలాంటిదేమీ లేదు" అంటూ నవ్వాడు. మధుమూర్తి నవ్వితే చాల బాగుంటాడు. పడుచుపిల్లల గుండెల్లో గులాబీలు పూయించగలడు. ఒక నవ్వుతో అతనికి ఆమె ఏమేమికావాలో వేస్తోంది. అతను భోజనం పూర్తిచేసి వచ్చేసరికి అతనికి వక్కపొడి యిచ్చి తనూ వెళ్ళి అన్నం ముందు కూర్చుంది. ఏదో తడబాటుతో ఆనందంతో, భయంతో వూపిరి ఆడనట్లు వుంది ఉమకి. అన్నం కొంచెం కూడా సహించలేదు. ఏదో యింత మజ్జిగ పోసుకుని లేచింది.

మధుమూర్తి ఏదో పుస్తకంలో మునిగిపోయి ఉన్నాడు. వంట యింట్లో అన్నీ పూర్తి చేసుకుని ఉమ వచ్చేసరికి తొమ్మిది దాటులోంది. మధుమూర్తి చదివే పుస్తకం పక్కకు పెట్టి, "రైట్, ఇప్పుడు చెప్పు ఉమా విశేషాలు" అంటూ తలగడ వాళ్ళో పెట్టుకుని కూర్చున్నాడు.

ఇద్దరూ అవీయివీ అని కాకుండా చాలసేపు కబుర్లు చెప్పుకున్నారు. అందులో రాజకీయాలు, సినిమాలు, కథలు, నవలలు, పత్రికలు, కాలేజీలు, చదువులు, ఇప్పటికాలం ఆడపిల్లలు, వాళ్ళ వెంటబడి ఫోజులుకొట్టే మగపిల్లలు, ప్రేమలు, వివాహాలు వాటి ఫలితాలు - ఒకటేమిటి అలా వెళ్ళిపోయిన సంభాషణ స్త్రీ పునర్వివాహం దగ్గర ఆగిపోయింది. మధుమూర్తి ఎంతో గంభీరంగా ఉపన్యసించాడు. ఉమ మాత్రం

మాట్లాడకుండా వింటూ కూర్చుంది. ఎందుకో ఆమె ఆ విషయం ఎక్కువ మాట్లాడలేకపోయింది.

కొందరు మనుష్యులు ఎందుకు కలుసుకుంటారో కాని వారి కలయిక చాలా అనర్థాలకి దారితీస్తుంది. అలాంటి ప్రమాదస్థితికి వస్తుందని తెలుస్తూనే వారు చూస్తూ చూస్తూ వారిని వారు నిగ్రహించుకోలేని మానసిక దౌర్బల్యానికి గురికావడం జరుగుతుంది. ప్రథమంగా ఒకరిమీద ఒకరికి ఏర్పడ్డ యిష్టం అది ఎంత అర్థంలేనిదైనా ఆ స్నేహం పెరిగిన కొద్దీ ఆ యిష్టం తీవ్రమైపోతుంది కాని సడలదు. ఉమ అతనికి ఎంతో దూరంగా వుండాలని ఒక పక్క అనుకుంటూనే అతనికి చాల చేరువైంది. అతను దేవకికి యిది మోసం చెయ్యడం అనుకుంటూనే ఉమమీద యిష్టం, జాలి కట్టలు తెంచుకునే కోర్కె ముప్పిరిగొని అలజడి చేస్తే వివశుడై పోయాడు. అతని మనసులో ఒక్కటే నిలిచిపోయింది. ఆమెకి అతనంటే ఎంతో ఆరాధన. ఆ విషయం తెలిసి అతను చలించి పోయాడు. మోడైన ఆమె జీవితాన్ని చిగురింప చెయ్యాలనే అతని వెర్రికోర్కె ఆవేశంగా మారింది. వంటరిగా వున్న ఆమెతో వున్న ఆ రాత్రి అతన్ని మరింకేమీ ఆలోచించ కుండా చేసింది. అతని స్పర్శకి ఆమె గాలికి చలించిన సన్నజాజి తీగై అతన్ని అల్లుకుపోయింది. ఆ స్పర్శలో యుగయుగాల బంధం, పొంగిపొరలే అనురాగం తప్ప, కామోద్రేకం కని

పించలేదు మధుమూర్తికి. అతను ఆమెను గుండెల్లో చేర్చుకుని ఓదార్చాడు.

○ ○ ○

తెల్లవారింది. ఉమ వంటయింట్లో స్టౌ ఎదురుగా కూర్చుని పొంగే పాలను చూస్తోంది. కాని గిన్నె దించలేదు. ఆమె మనసు అక్కడలేదు, తప్పుచేసి పట్టుబడిన చంటిపిల్లలా ఆమె కళ్ళల్లో నీళ్ళు వూరుతున్నాయ్.

"ఉమా ?"

ఆమె వులిక్కిపడింది. తలెత్తి అతనికేసి చూడలేక పోయింది. నిన్నటి రోజు అతనితో మాట్లాడినంత హాయిగా యిప్పుడెందుకు మాట్లాడలేక పోతోందో ఆమెకి తెలియ లేదు. నిశ్శబ్దంగా నిలబడిన ఆమెని చూస్తే అతనికి ఎంతో జాలేసింది.

ఉమా ! నువ్వు బాధపడుతున్నావా ? బాధపడే స్థితిలో నిన్ను వుంచేవాడిని కాను. నీకు పరిపూర్ణమైన బ్రతుకిస్తా - యిటు చూడు, నువ్వు నాదానివని అందరికీ తెలిసేలా చెప్తాను - ఊ - సరేనా - నువ్వేం బెంగపడకు" అన్నాడు.

ఆమె ఒక అంగలో అతని దగ్గర చేరి "మధూ ! మీరలాంటి పని మాత్రం చెయ్యకండి. నేను మొదటిసారి మిమ్మల్ని చూసినప్పుడే నేనేమిటో తెలుసుకోలేకపోయాను.

ఈ రోజు యిలా జరిగిందని బాధేమీ లేదు. కాని నా ప్రాణ స్నేహితురాలికి ద్రోహం చేశానని చాలా కష్టంగా వుంది."

"ఈ ప్రపంచంలో ఎవరికెవరూ మోసం చేయ్యలేరు. అది నీ భ్రమ - అన్నీ నీకు చెప్తాను. మళ్ళీ నేను పదిగంటల బండికి వెళుతున్నా - రాజమండ్రిలో పని చూసుకొని అటే వెళ్ళిపోతా" ఉమ మాట్లాడలేదు. మధుమూర్తి చకచకా తన పని ముగించుకుని తొమ్మిదిన్నరకి ఉమకి మళ్ళీ ధైర్యం చెప్పి హుషారుగా వుండమని చెప్పి వెళ్ళిపోయాడు. ఉమ గాఢాంధకారంలో మెరుపులాంటి అతని రాకని, కలా? నిజమా? అని ఆలోచిస్తూ మనసూ తనువూ అనుభవించిన ఒక మధురానుభూతిని తలుచుకుంటూ ఆ రోజంతా గడిపేసింది.

ఉమ యింటర్వ్యూకి వెళ్ళింది. ఆమెకి వుద్యోగం యిచ్చారు. తాడేపల్లి గూడెంలో బి. యిడి. మొట్ట మొదటి సారిగా కొత్త జీవితాన్ని తలుచుకుని మురిసిపోయింది. వెంటనే వెళ్ళి జాయిన్ అవుతున్నట్లు దేవకికి వుత్తరం వ్రాసింది వ్రాయడం దేవకికి అయినా అందులో అంతా మధుమూర్తికే. దేవకి ఆ వుత్తరం చదివి ఎంతో మురిసిపోయింది. "మా ఉమ వ్రాసింది" అంటూ భర్త చేతిలో పెట్టింది. మధుమూర్తి చదివి వుత్తరంలోని భావానికి ముగ్ధుడైపోయాడు ఉమకి తన మీద వున్న అనురాగానికి.

o o o

స్కూలుకి దగ్గరలోనే ఒక గది అద్దెకి తీసుకుంది. ఇలుగలవాళ్ళు పెద్దకుటుంబం ఆరుగురు ఆడపిల్లలు, ముగ్గురు మొగపిల్లలు, కోడళ్ళతో, అల్లుళ్ళతో యిల్లు నిండుగా వుంటుంది. ఇల్లు పెద్దదే. గది అద్దెచ్చాకిరంటే కేవలం డబ్బు కోసం అంతే. వాళ్ళ నాలుగో అమ్మాయి పురిటికొచ్చింది సరిగ్గా ఉమ వాళ్ళింట్లో చేరిన మరుపటిరోజు ఆమెకి పురుడు వచ్చి ఆడపిల్ల పుట్టింది, చాలా కొంచెం పరిచయంతో వాళ్ళకి ఉమ చాలా సహాయంగా వుండటంతో ముసలాయనకి పెద్దావిడికి ఆత్మీయురాలై పోయింది. రెండు రోజుల పసి కందును ఎత్తుకుని ముద్దాడి స్నానంచేసి యింట్లోకి వచ్చిన ఉమ శరీరంలో ఏదో కొత్త గగుర్పాటు కలిగింది. వంట్లో చలి చలిగా అనిపించింది. ఎంతో బద్ధకంగా గొంతులో ఏదో కదులుతున్నట్లు అనిపించింది. తల ఆరబెట్టుకుని ఆ రాత్రికి ఏమీ భోజనం చేయకుండా పడుకుంది. తెల్లవారగట్ల లేస్తూనే కడుపులో ఏదో వికారంగా, చిత్రంగా అనిపిస్తే అంత పట్టించుకోలేదు. రెండు మూడురోజులు బద్ధకంగా అనిపిస్తూనే వుంది. వికారంగా గొంతులో ఏదో కదులుతున్నట్టు వుండటం, అసహ్యంగా అనిపించడం మాత్రం తగ్గలేదు. ఆ రోజు తెల్లవారగట్ల కలతనిద్రలో ఆమె అటూ యిటూ పొర్లుతోంది. అదో పెద్దహాలు, హాస్పటల్ అనిపిస్తోంది. ఎన్నో మంచాలు, అన్ని మంచాలమీద నీరసంగా, తెల్లగా పాలిన ముఖాలతో - తెలియని ఆనందపు వూహాలతో నిండిన కళ్ళతో స్త్రీలు, వారి మంచాలపక్కన ఒక్కొక్క తొట్టెలో ఒక్కొక్క పాపాయి, కొందరు ఆడపిల్లలు - కొందరు మగ

పిల్లలు - ఉమకి ఏదో సన్నగా చంటిపిల్ల "క్యార్" మని ఏడ్చినట్లు వినిపిస్తోంది. ఆమె ఉలిక్కిపడి లేచింది. పక్క గది లోంచి యింటిగలవారి చంటిపాప ఏడుస్తోంది. ఆమెకి పొత్తి కడుపులో ఏదో కదిలినట్లే వికారం పెట్టింది. ఉమ బయట కెళ్ళి నీళ్ళు నోట్లో పోసుకుని పుమ్మి వచ్చింది. అలా మంచం మీద పడుకుని యిందాకటి కలగాని కల తలుచుకుంటే చిత్రంగా అనిపించింది. ఇంతలో ఆమెకి ఏదో జ్ఞాపకం వచ్చి భయంతో గుండె గుబ గుబ లాడింది. అది ఒక్కక్షణం మాత్రమే. వెంటనే ఆమె హృదయం ఆనందంతో పొంగి పోయింది. తీయనిభావం ఆమె గుండెనిండా నిండిపోయింది. తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది. మళ్ళీ అదే దృశ్యం. ఎక్కడ చూసినా పాపలు - పాపలు - ఆమెకి గుండెల్లోంచి ఎవరో "అమ్మా" అన్నట్లు అనిపించి కళ్ళు తెరిచింది. తనలో తనే నవ్వుకుంది. నిజంగా తనకి పాపాయి పుడితే - ఈ సంఘం ఈ మనుష్యులు - ఈ సాంప్రదాయం-ఇవన్నీ ఏమైపోతాయి? అనిపించింది. మళ్ళీ వెంటనే ఏమైపోయినా నాకేమిటి నాకు బంగారు పాపాయి, ముత్యాల పాపాయి కావాలి. ఉమ ఆలోచనలు ఈ విధంగా సాగిపోతున్నాయి.

"పాలూ" అంటూ కేక వినగానే ఆమె లేచింది.

రోజూ ఆమె స్కూలుకి వెళ్ళివస్తోంది. చిత్రంగా ఆమెకి నలుగురిలో వుండగా వికారం, మత్తు వుండక పోవడం యింట్లో వున్నప్పుడే అలాంటి సూచనలు కనిపించడం మొదలు పెట్టాయి. ఆమె తను గర్భవతినని నిర్ధారణ చేసుకుంది. కాని

బయటపడితే ? అని ఆలోచించుకుని కొంచెం చలించినా - వెంటనే మధుమూర్తికి ఆ విషయం వ్రాయాలని అనుకుంది. కాని ఎలా వ్రాయాలి ? దేవకి ఏమనుకుంటుంది. ఎలా తెలియజెయ్యడం అని ఆలోచిస్తూనే నెలా పదిహేను రోజులు గడిచిపోయింది.

ఆ రోజు మధుమూర్తి దగ్గరనుండి వచ్చిన ఉత్తరం చూసి ఎంతో మురిసిపోయింది. అందులో వున్నవి నాలుగే వాక్యాలు -

ప్రియ ఉమా !

నేను వచ్చేనెల 4, 5 తేదీలలో వస్తున్నా. నువ్వు కలతలేమీ లేకుండా హాయిగా వున్నావని తలుస్తా. చాల విషయాలు ముఖాముఖి చెప్తా, ఎప్పుడూ నీకు అండగా నిలిచే

నీ

మధుమూర్తి.

ఆ ఉత్తరం ఎన్నిసార్లు చదివిందో తెలియదు. ఒక్కొక్కసారి ఒక్కొక్క కొత్తఅర్థం స్ఫురించింది. అలాఅది చదువుతూ గుండెలమీద పెట్టుకుని నిద్రపోయింది.

*　　　*　　　*

ఉమ లెక్క ప్రకారం ఆమెకి రెండు నెలలు నిండి మూడో నెల వచ్చింది. మధుమూర్తి రాకకోసం ఉమ ఎదురుచూస్తూ గడుపుతోంది కాలం.

"నిజంగా! అంటూ గుండెలమీద చెయ్యి వేసుకుంది ఉమ. భయం, ఆశ్చర్యం, ఆనందం ఆమెలో ఒక్కసారి కట్టలు తెంచుకుని వురికాయి. ఆమెకి తను వినే విషయం నిజమా అనే అనుమానం. అదే నిజమైతే తనెలా ఎదుర్కోగలదు అనే భయం వేధించసాగాయి. మధుమూర్తి చిన్నగా నవ్వుతూ "ఏం? అంత ఆశ్చర్యం ఎందుకు? దేవకి విషయం నీకు తెలియదు. మనసా, వాచా చాలా సంస్కారవంతురాలు. ఒకే ఒక్కమాట చెప్పింది -

అదే - నిన్ను పెళ్ళి చేసుకోమని-, తను అభ్యంతరం చెప్పననీ - నేను నిన్ను పెళ్ళిచేసుకున్నా తనకి అన్యాయం చేయనని నమ్మకం వుందిట - నిజంగా దేవకి నాకు భార్య అయినందుకు చాల గర్వపడుతున్నాను." కళ్ళప్పగించి చూస్తున్న ఉమ ఒక్కసారి అతని గుండెల్లో తల దాచుకుంది. ఆమె వెచ్చటి కన్నీటితో అతని షర్టు తడిసిపోయింది. ఆమె నిశ్శబ్దంగా రోదించింది. అతను ఆమెని ఏడ్వనిచ్చాడు. అలాంటి సమయంలో ఏడ్వకుండా ఏ ఆడదీ వుండదు. అదే చేసింది ఉమ. మధుమూర్తి కొంచెంసేపు గడిచాక స్థిమితంగా ఏదో చెప్పాలని మొదలుపెడుతూ -

"ఉమా నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి" అన్నాడు. ఉమ మాత్రం ఆనందలో తేలిపోతూ.

"మధూ మీరిప్పుడు నాకేం చెప్పవద్దు. మీ కంటే ముందుగా నేనే ఒక మంచి విషయం చెప్పాలి" అంది. అతనేమీ మాట్లాడలేదు. ఆమె అతనికాళ్ళదగ్గర కూర్చుంది. ఆమెకి ఎలా చెప్పాలో తెలియలేదు. ఎలా దాచాలో కూడా తెలియకుండా మనసులో అలజడిని అణచలేకుండా వుంది ఆమె తలమీద చెయ్యివేసి అతను అడిగాడు ఏమిటని. ఆమెకి మాట పూడిపడలేదు గాని కళ్ళల్లో నీటిపొర కమ్మింది. ఆమె మెల్లగా ధైర్యాన్ని కూడదీసుకుని "నేను యిప్పుడు - నేను యిప్పుడు" ఆగిపోయింది.

"ఏమిటి నువ్విప్పుడు" అతని పెదవుల మీద నవ్వు నాట్యం చేస్తుంది.

"నేనూ - యిప్పుడూ" అంటూ అతని కళ్ళల్లోకి చూస్తూ "నాకు ఇప్పుడు మూడో నెల" అంది.

మధుమూర్తి ఒక్కసారి పాము కాటుకి కంపించినట్లు వణికిపోయాడు. వొక్క క్షణం అతనికి తనేం వింటున్నాడో అర్థంకాలేదు. మెదడు మొద్దుబారిపోయినట్లు అయిపోయింది. అతనిలో కలవరం కనిపెట్టిన ఉమ చలించిపోయింది. తన జీవితానికి వరంగా భావించిన ఈ విషయం అతనికంత భయంకరమైందని ఆమెకి తెలిసి మనసు చిన్నబోయింది. మధుమూర్తి చైతన్యం కూడదీసుకుని.

"ఉమా నువ్వంటున్నది ఏమిటి ! నాకు తెలీటం లేదు" అన్నాడు.

"నిజం : మధూ నిజం. నేను తల్లిని కాబోతున్నా." ఈసారి అతనికి ఒక్కసారి కోపం చర్రున లేచింది. అతని మనసు అసహ్యంతో, జుగుప్సతో దహించుకుపోసాగింది. కోపంతో అతను వూగిపోయాడు అతని మనసు పశ్చాత్తాపంతో ముడుచుకుపోయింది. అతనికి దేవకి జ్ఞాపకం వచ్చింది. ఆమెపట్ల తను చూపించిన నిరాదరణ గుర్తుకొచ్చి కళ్ళల్లో నీరు చిమ్మింది, అర్హతలేని మనిషిని అందలం ఎక్కించబోయి తనే జారిపడినట్లు ఫీల్ అయి ఇంక అక్కడ ఒక్కక్షణం నిలువలేని నిస్సహాయ స్థితికి జారిపోయాడు. కాని అతని హృదయం ప్రతీకార వాంఛతో భగ్గున మండింది. చర్రున ఆమెవైపు తిరిగి ఏదో అనబోయాడు. నిస్సహాయంగా అమాయకంగా వున్న ఆమెని చూడగానే అతనిలో కోపం మరింత పెరిగింది. ఆమె ప్రవర్తన మీద అతనికి పూర్తిగా కంపరం పుట్టుకొచ్చింది.

"చాలు ఉమా చాలు. నీ నటనకి చాల థాంక్స్. ఈ విధంగా నన్ను మోసగిస్తావని తెలిస్తే కనీసం నీ దరిదాపులకి కూడా వచ్చేవాడిని కాను, నీ గాలి కూడ తగలనంత దూరంపోయి వుండేవాణ్ణి. చాలు - యిప్పుడైనా కళ్ళు తెరిపించాడు దేవుడు - వస్తాను."

ఉమకిదేమీ అర్థంకాలేదు. ఏమి చెప్పాలో అసలు తను చేసిన తప్పేమిటో అర్థంకాలేదు. కాని మోసం అనే

మాట ఆమె హృదయంలో బల్లెంలా గ్రుచ్చుకుంది. క్షణం విలవిల్లాడిపోయింది. ఏదో చెప్పాలని తాపత్రయపడింది. దుఃఖంతో గొంతుక పూడుకుపోయింది. కళ్ళనిండా నీరు నిండి చెంపలమీదికి జారిపోయాయి. రెండడుగులు వేసి మధుమూర్తి చటుక్కున వెనక్కి తిరిగి -

"ఇదిగో నువ్వు నన్ను మోసం చేసి నీ పాపాన్ని నా మెడకి చుట్టాలని చూశావు. కాని నేను ముందుగా చెబుదామనుకున్నా. నేను ఎప్పుడో ఏడాది క్రితం ఆపరేషన్ పిల్లలు పుట్టకుండా చేయించుకున్నాను. నావల్ల నీకు పిల్లలు పుట్టడం ఎలా సాధ్యం? ఉమా! మోసానికి ఒక అంతూ అదుపు వుండాలి. నీలో వున్న ధైన్యాన్ని, నీ బ్రతుకును మింగే చీకటిని తొలగించాలని అనుకున్నా - కాని నీవు చేసిన పాపాల్ని, చెయ్యబోయేతప్పుల్ని కప్పిపుచ్చడానికి నెత్తి నేసుకోడానికి కాదు. ముమ్మాటికీ కాదు. నువ్వు ఎవరి దగ్గర ఎలాంటి సుఖాన్ని, భోగాన్ని అనుభవించనీ ఈ మధుమూర్తి దగ్గర లభించిన నిష్కల్మష ప్రేమ మాత్రం ఎక్కడా లభించదు. కాని ఎవరినీ యిలా మోసం చెయ్యకు. నాకు తెలుసు నాకు పిల్లలు పుట్టరు. పుట్టకూడదనే నేను ఆపరేషన్ చేయించుకున్నా - నాకూ నా దేవకికి వున్న యిద్దరు పాపలు చాలు - చాలు -" తలుపు దభేలున వేసి వెళ్ళిపోయాడు.

ఉమ శిలాప్రతిమలా నిలబడి వుంది. తను విన్నది కలా నిజమా అనిపిస్తోంది. మనసు మొద్దుబారిపోయింది. శూన్యంగా

అనిపించింది. అలమారాల్లోంచి అలారం గట్టిగా మ్రోగడంతో ఆమెలో పూర్తి మెలకువ వచ్చింది. విషయం పూర్తిగా అర్థమై ఆమెకి దుఃఖం ఆగలేదు. వెక్కి వెక్కి ఏడ్చింది. గుండెలో బరువు తీరలేదు. ఏడుస్తూనే ఆమె మెల్లగా అసలు విషయం తర్కించడం మొదలుపెట్టింది. మధుమూర్తిని తప్ప మరొకర్ని కనీసం కన్నెత్తి చూడని తనకి ఏమిటి యిలా జరిగింది ! మధు ఎంతలేసి మాటలన్నారు ఏది నిజం ! ఎందుకిలా జరిగింది. అసలు తనకేమైంది. తనెందుకిలా అయింది ? మధు తనమీద ఎందుకింత నింద మోపారు. నిజమేనా అతనికి పిల్లలు పుట్టరూ ! అయితే తన కడుపులో పెరుగుతున్న పాప ఎవరు ? అయ్యో తన ప్రాణానికి ప్రాణం పాప, తన చీకటి బ్రతుక్కి వెలుగు చూపించిన మధుమూర్తి ఎంత నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోయారు ? అంటే తను ఈ విధంగా వుండటం అతనికి యిష్టంలేదు. పైగా తను మోసం చేసిందా! తనా - మోసమా ! మోసం అనే మాట పదే పదే ఆమె చెవుల్లో మారుమ్రోగి హృదయం తూట్లుపడేలా చేస్తోంది. ఆమె ఎంత ఏడ్చినా తరగని బరువు, తీరని సమస్య ఆమెని పట్టి వేధించసాగాయి. ఉమ కంటికి కునుకులేకపోయినా తెల్లవారింది. ఆమె ఒక నిశ్చయానికొచ్చింది. లేచి ముఖం కడుక్కుని చీర మార్చుకుంది. రాత్రంతా నిద్రలేకపోవడం వల్ల నీరసంగా వొళ్ళు తూలుతోంది. జరిగిన సంగతి మళ్ళీ గుర్తు చేసుకుంటే గుండెలో గుబులుగా అనిపించి కన్నీళ్ళు వస్తున్నాయి ఆమె యింటికి తాళం పెట్టి రిక్షా ఎక్కింది.

* * *

ఉమని పరీక్ష చేసిన డాక్టరమ్మ చిన్నగా నవ్వుతూ, “నీకు పిల్లలంటే చాలా యిష్టమా అంది. ఆమె అలా ఎందుకడుగుతుందో అర్థం కాలేదు ఉమకి. మాట్లాడకుండా నిలబడింది మళ్ళీ డాక్టరమ్మే అంది.

“నీకు గర్భిణి కాదమ్మా, అది నీకు పిల్లలంటే యిష్టం వల్ల, కావాలనే తీవ్రమైన కోరికవల్ల ఏర్పడిన భ్రమ. దీన్ని సూడో ప్రెగ్నెన్సీ అంటారు. నెక్స్టైమ్ బెటర్ లక్” అంటూ కుర్చీలోంచి లేచింది.

ఉమ ఆమె మాటలకి నిర్ఘాంతపోయి నిలబడిపోయింది. ఏ పాపకోసం తను పరితపించిపోతూ కలలు కంటూ వుందో ఆ పాప తనకి లేదు. ఈ విధమైన ఒక భ్రమలో తను పడి మధుమూర్తికి తనమీద అనుమానం కలిగేలా చేసుకుంది. కాని యీ విషయం తనతనికి ఎలా చెప్పగలదు ? చెప్పినా అతను నమ్ముతాడా ? నమ్మడు - ముమ్మాటికీ నమ్మడు. తనేదో యింకా నాటకం ఆడుతోందని అనుకుంటాడు. ఎలా ? తనెలా బ్రతకగలదు ? ప్రపంచమంతా ఏమనుకున్నా, తను నమ్మిన వ్యక్తి నమ్మితే చాలనుకుంది. కాని యిప్పుడు ప్రపంచమంతా ఏమీ అనలేదు. తను నమ్మిన మనిషి తనని అసహ్యించుకుంటాడు. మరింక ఈ జన్మలో తనతని ముఖం చూడలేదు ఉమ చెంపలమీద కన్నీరు జల జల రాలింది. డాక్టరమ్మకి ఆ దుఃఖం సహజంగానే అనిపించింది. మెల్లగా ఉమ భుజం తట్టి “డోంట్ వర్రీ మై ఛైల్డ్” అంటూ ఆమె కన్సల్టింగ్ రూమ్ లోకి వెళ్ళిపోయింది.

( ఆంధ్రజ్యోతి వారపత్రిక నుండి )